క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సేఫ్టీ వార్డెన్ జీఆర్‌మౌళి

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ ఆదేశానుసారం శనివారం స్థానిక ఐబీ చౌరస్తాలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రయాణికులకు గమ్యం యాప్ గురించి వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మహాలక్ష్మి పథకం అమలుపై వివరించారు. బస్సు ఎక్కేటప్పుడు నిదానంగా బస్సు ఎక్కాలన్నారు. ట్రాఫిక్ రూల్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సేఫ్టీ వార్డెన్ జీఆర్‌మౌళి, కంట్రోలర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

'ఇద్దరు విలేకరులు పద్ధతులు మార్చుకోవాలి'

బెల్లంపల్లి: విలేకరుల ముసుగులో అరాచకాలకు పాల్పడుతున్న బెల్లంపల్లికి చెందిన బద్రి శివప్రసాద్, బద్రి వెంకటేశ్వర్లు పద్ధతులు మార్చుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో గతంలో గూండాలకు పట్టిన గతే పడుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ తీవ్రంగా హెచ్చరించారు. శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. పోలీసులతో మైత్రి కొనసాగిస్తూ గూండాయిజం, లంపెనిజాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలపై అకృత్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జర్నలిజానికి మచ్చతెచ్చే విధానాలను కొందరు విలేకరులు మానుకోవాలని, బద్రి శివప్రసాద్, బద్రి వెంకటేశ్వర్లు పద్ధతులు మార్చుకుని ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే కుందేళ్ల శంకర్, దస్తగిరి వంటి గూండాలకు పట్టిన గతి తప్పదని హెచ్చరించారు.

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హబ్‌జెండర్‌లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలోని విద్యార్థినులకు జిల్లా సంక్షేమ శాఖకు చెందిన మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్షియల్ లిటరసీ లిప్సికలు మహిళా సాధికారతపై శనివారం అవగాహన కల్పించారు. బేటీ బచావో, బేటీ పడావో పథకం, లింగనిర్ధారణ చట్టం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 1930, సఖీ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ నంబర్ 1098లపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

తాండూర్ వారసంత వేలం

తాండూర్: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి బుధవారం నిర్వహించే వారసంతకు శనివారం వేలం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2024–25సంవత్సరానికి సంబంధించి 9 నెలలకు గాను వార సంత నిర్వహణ కోసం బహిరంగ వేలం నిర్వహించారు. షేక్ మోమిన్ అలీ అనే వ్యక్తి రూ.70వేలకు వారసంతను దక్కించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో కార్యదర్శి తపాస్ కుమార్, చందు, ఈసా, నాగయ్య, విఘ్నేష్, హైమద్ హుస్సేన్, శ్రీనివాస్, కైసర్, శివ, రాజేష్, పంచాయతీ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్లు పెంచాలి

భీమారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార విలువలు కలిగిన కిచెన్ గార్డెన్ పెంచాలని ఎంపీడీవో రాధారాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోషకాహారం విలువలు కలిగిన ఆకు కూరలతో పాటు కూరగాయల ను కేంద్రం లోనే పెంచి వాటితో పిల్లలకు ఆహారం అందిస్తే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. ఇక నుంచి ప్రతి కేంద్రంలో కూరగాయల సాగు చేయాలని, దీని ద్వారా కేంద్రాల్లో చదువుకుంటున్న పిల్లలకు మంచి పోషకాలు ఇచ్చే ఆహారాన్ని ఇస్తున్నారనే న మ్మకం తల్లిదండ్రుల్లో కలుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక లక్ష్మీనగర్ శ్రీచైతన్య స్కూల్‌లో ఫ్రెషర్స్ డేను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పాత విద్యార్థులు కొత్త విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌చార్జి అనగమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రకటన బోర్డులు..?

- అనుమతులు తీసుకోకుండా ఇష్టారీతిన ఏర్పాటు
- ఈదురు గాలులకు రోడ్లపై పడుతున్న వైనం
- వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్న బోర్డులు
- ప్రకటన బోర్డులకు తగిలి తెగిపోతున్న విద్యుత్ తీగలు
- మున్సిపల్ ఆదాయానికి గండి



ఇటీవల ఈదురుగాలులకు రోడ్డుపై పడిన ప్రకటన బోర్డు

మంచిర్యాలటౌన్: అనుమతులను తీసుకోకుండానే ఎక్కడ పడితే అక్కడ ప్రకటన బోర్డులు ఏర్పాటు చేస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడంతో పాటు, ప్రజల ప్రాణాలకు హాని కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. మంచిర్యాల పట్టణంలో ఎటువైపు చూసినా హోర్డింగులతో పాటు, నాలుగు చౌరస్తాల్లోనూ ప్రకటన బోర్డులు, పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. పెద్ద పెద్ద హోర్డింగులను మున్సిపల్ అనుమతులతో కొన్ని ఏర్పాటు చేస్తున్నా, అందులో సగం వరకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఎవరికి నచ్చినట్లు వారు ఏర్పాటు చేసుకుంటున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల హోర్డింగులతో పాటు ప్రకటన బోర్డులను రోడ్లకు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. చౌరస్తాల్లో ప్రజల చూపు పడేలా పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసి ఉంచుతున్నారు. ఈదురు గాలులకు ఆ బోర్డులు రోడ్డుపై పడి వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్నాయి. విద్యుత్ తీగలకు ఆనుకునే ఈ ప్రకటన బోర్డుల ఏర్పాటుతో, గాలి బాగా వీచినప్పుడు బోర్డులు తీగలకు బలంగా తాకి, విద్యుత్ తీగలు తెగి కింద పడుతుండగా, బోర్డులు రోడ్డుపై పడుతున్నాయి. ఇటీవల వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డు ఈదురుగాలులకు రోడ్డుపై పడగా, రాత్రి సమయంలో బోర్డు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రకటన బోర్డులు రోడ్లపై పడి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నా, మున్సిపల్ అధికారులు గాని, బోర్డులను పెట్టిన వాటి యజమానులు గాని పట్టించుకోకపోవడంతో, రోజుల తరబడి అవి రోడ్లపైనే ఉంటున్నాయి.

ప్రకటన బోర్డులు తొలగిస్తాం



మంచిర్యాల మున్సిపాలిటీలో అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న ప్రకటన బోర్డులన్నింటినీ తొలగిస్తాం. వర్షాకాలం కావడంతో ఈదురుగాలులు వీస్తున్నాయి. ప్రమాదాలు జరగక ముందే ప్రకటన బోర్డులన్నింటినీ తొలగించేలా చర్యలు తీసుకుంటాం. అనుమతులను తీసుకోకుండా ఏర్పాటు చేస్తున్న ప్రకటన బోర్డు యజమానులకు మున్సిపల్ చట్ట ప్రకారంగా నోటీసులు ఇచ్చి, చర్యలు తీసుకుంటాం. మున్సిపల్ సిబ్బంది ప్రకటనల బోర్డుల ఏర్పాటుకు సహకరించినా, వారిపై చర్యలుంటాయి.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

పారిశుధ్య కార్మికుల సమస్యలు తీర్చండి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ.. 60ఏళ్లు పైబడిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఒకరికి అవకాశం కల్పించాలని, అనారోగ్యంతో విధులను నిర్వర్తించలేని వారి స్థానంలో కూడా కుటుంబ సభ్యులకు ఒకరికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోగర్ల ఆశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంకుమార్, ఉపాధ్యక్షుడు వాసాల కుమారస్వామి, ఉప్పులేటి రామస్వామి, ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి తిరుపతి, కోశాధికారి ఆవుల శ్రీనివాస్, ఇప్ప రవి, జనరల్ సెక్రటరీ మోకనపెల్లి శశిధర్, చిప్పకుర్తి రాకేశ్, కార్యదర్శి బూడిత తిరుపతి పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు, కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలి



ఎక్సైజ్ ఎస్సైకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులు, కల్లు దుకాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, పసులేటి వెంకటేష్ ఎక్సైజ్ అధికారులను డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న పట్టణాలు, గ్రామాలల్లో అనధికారికంగా బెల్ట్‌షాపులు జోరుగా నడుస్తున్నాయన్నారు. విచ్చల విడిగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేసుకుని, అధిక ధరకు అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తూ అధికారులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఎక్సైజ్ అధికారులు వెంటనే చర్యలకు దిగి బెల్ట్ షాపులు మూసి వేయించి, కల్లు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



సన్మానిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి అందించడంతో పాటు అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించి, ప్రజలతో మమేకమైన సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ సంచాలకులుగా పనిచేసిన వై.రమేష్, జిల్లా మత్స్యశాఖ అధికారిగా పనిచేసిన సత్యనారాయణ పదవీ విరమణ పొందిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌మోతీలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై పదవీ విరమణ పొందిన రమేష్ దంపతులను, సత్యనారాయణ దంపతులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. పదవీ విరమణ పొందిన అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడుపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, మంచిర్యాల జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, రామ్మోహన్, తిరుపతి, రామ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ



పాల్గొన్న చైర్మన్, పర్యవేక్షణ అధికారి, ఎంపీటీసీ

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అంజేసే రైతు భరోసా పథకంపై దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్ సహకార సంఘం కార్యాలయంలో ఆడిట్ సబ్‌రిజిస్టార్ బిక్కు పర్యవేక్షణలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రైతుభరోసా పథకంపై రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఎలాంటి రైతులకు రైతు భరోసా అందిస్తే బాగుంటుంది, ఎన్ని ఎకరాల వరకు పరిమితి చేయాలి, తదితర సలహాలు సూచనలను రైతుల నుంచి తీసుకున్నారు. సహకార సంఘం చైర్మన్ కాసనగొట్టు లింగన్న, ఎంపీటీసీ సభ్యుడు ముత్యాల శ్రీనివాస్, సిబ్బంది కిషన్, వెంకటేష్, సాయి, సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌కు 'కోల్‌బెల్ట్ ఎక్స్‌ప్రెస్' నడపాలి

బెల్లంపల్లి: కోల్‌బెల్ట్ ప్రాంతం నుంచి సికింద్రాబాద్‌కు కోల్‌బెల్ట్ ఎక్స్‌ప్రెస్ పేరుతో ప్రత్యేక రైలును నడపాలని బెల్లంపల్లికి చెందిన పద్మశాలి, వీధి వ్యాపారుల సంఘం నాయకుడు కె.శ్రీనివాస్ కోరారు. రైల్వే అధికారులకు శనివారం ఆయన వినతి పత్రం పంపించారు. రోజువారీగా హైదరాబాద్ వెళ్లడానికి కోల్‌బెల్ట్ ఎక్స్‌ప్రెస్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైల్వే అధికారులు సానుకూల నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక చేయూత

మంచిర్యాలఅర్బన్: స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న తల్లిదండ్రులు లేనటువంటి మూడో తరగతి విద్యార్థి ధీరజ్‌కుమార్‌కు ఆర్థిక చేయూత నందించారు. గీతాభవాని జ్ఞాపకార్థం రామ్‌కిషన్ పేద విద్యార్థి ధీరజ్‌కుమార్ ఏడాది ఫీజు రూ.13000 చెల్లించేందుకు ముందుకొచ్చారు.

నస్పూర్: పట్టణ పరిధిలోని రెండో వార్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం అయిన బాధిత కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు రూ.5వేల నగదు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు.

ఎయిడ్స్ పై అవగాహన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో శనివారం సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో శ్రీమన్నారాయణ, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ సతీశ్, దిశ సీపీఎం నీలిమ, సీహెచ్‌వో రాజేశ్, సంతోశ్, ఐసీటీసీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకాంత్ జయంతి

మందమర్రిరూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మహత్యకు పాల్పడిన పట్టణంలోని రామన్ కాలనీకి చెందిన రాంటెంకి శ్రీకాంత్ జయంతిని శనివారం తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ హాజరై శ్రీకాంత్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రభుత్వ అధికార ప్రతినిధికి సన్మానం

బెల్లంపల్లి: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్ రెడ్డికి యువజన కాంగ్రెస్ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ శుభాకాంక్షలు తెలిపారు. తన ఛాంబర్‌లో శనివారం జితేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానం చేశారు.

ఎన్నికల సాధన కోసం కలిసిరావాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపల్ ఎన్నికల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాల్సిన అవసరం ఉందని మున్సిపల్ ఎన్నికల జేఏసీ సభ్యుడు గుడికందుల రమేష్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టణంలోని అంగడి బజార్ ఏరియాలోని శివాలయం సమీ పంలో గల పద్మశాలీ భవన్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి పార్టీలకతీతంగా హాజరుకావాలని తెలిపారు.

నేడు ప్రమాణస్వీకారం

పాతమంచిర్యాల: లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జూన్ 30న ఆదివారం ఉదయం 10.30గంటలకు జిల్లా కేంద్రంలోని లక్సెట్టిపేట రోడ్‌లో శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం చైర్‌పర్సన్ మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, లయన్ డెలిగెట్స్ హాజరవుతున్నారన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పాతమంచిర్యాల: మహిళా సంఘాల సభ్యులు అన్ని రంగాల్లో రాణించి ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు డి.రాజేశ్వరీ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ పథకాల ద్వారా అభివృద్ధి సాధించాలన్నారు. మహిళా శక్తి ద్వారా మీ సేవా కేంద్రాలు, సూపర్ మార్కెట్లు, నెలకొల్పడానికి నిర్ణయించిందని, అర్హత ఆసక్తి గల వారికి కేటాయించనున్నట్లు తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం

దండేపల్లి: లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన దాసరి ప్రేమ్‌చంద్, డైరెక్టర్లు కట్కూరి రాజన్న, బండ రాకేష్, గాండ్ల విజయ్, కనక జంగులను అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మేదరిపేటలో శనివారం ఘనంగా సన్మానించారు.

బొగ్గుబాయి వార్తలు

విజిటర్స్ హాల్ ప్రారంభం



విజిటర్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజిటర్స్ హాల్‌ను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎం కార్యాలయంలోని ఉన్నతాధికారులను కలవడానికి వచ్చే ఉద్యోగులు, ఇతర సందర్శకులు వేచి ఉండడానికి ఇన్నాళ్లుగా ఇబ్బంది ఉండేదని, ఈ ఇబ్బందిని తీర్చడం కోసం రూ.5లక్షలతో ప్రత్యేక విజిటర్స్ హాల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటుజీఎం పురుషోత్తం రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం అరవిందరావు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత బన్న లక్ష్మణ్‌దాస్‌ను శనివారం గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సామాజిక కార్యకర్తగా విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అంశాలపై కృషి చేసినందునా సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ భూశంకరయ్య, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



జైపూర్: జీఎం బసివిరెడ్డిని సన్మానిస్తూ..



పురుషోత్తం రెడ్డి దంపతులను సన్మానిస్తూ...

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తూ శనివారంతో ఉద్యోగ విరమణ పొందిన ఏరియా ఎస్ఓటుజీఎం పురుషోత్తం రెడ్డిని ఏరియా అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జీఎం సంజీవరెడ్డి, గుర్తింపు సంఘం ఏరియా కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, డీజీఎంలు అరవిందరావు, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, పర్సనల్ డిపార్టుమెంట్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు .

జీఎం బసివిరెడ్డికి ఘనంగా వీడ్కోలు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ జీఎంగా, ఎస్టీపీపీ ఈడీగా విధులు నిర్వర్తించిన చిన్న బసివిరెడ్డి ఆదివారంతో ఉద్యోగ విరమణ పొందుతుండగా ఎస్టీపీపీ అధికారులు, ఉద్యోగుల బృందం శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు, ఉద్యోగులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యకమంలో ఎస్టీపీపీ అధికారులు ఎలిషా, ప్రసాద్, సుధాకర్, శ్రీనివాసులు, రమణ, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట గనిపై...

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై శనివారం ఉద్యోగ విరమణ పొందిన కార్మికుడు మేడి సమ్మయ్యను గని మేనేజర్ భూ శంకరయ్య, కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఐఎన్‌టీయూసీ ఏరియా నాయకులు దేవి భూమయ్య, కాంపెల్లి సమ్మయ్య, సూర్యనారాయణ, గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి జీషాన్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో...

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సర్వే విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న పడాల నర్సయ్యను ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో శనివారం ఏరియా జీఎం మనోహర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు పాల్గొన్నారు.



మందమర్రిరూరల్: అధికారిని సన్మానిస్తున్న జీఎం



కాసిపేట: కార్మిక దంపతులను సన్మానిస్తూ...

'పౌర హక్కులకు భంగం కలిగించొద్దు'

నెన్నెల: పౌర హక్కులకు భంగం కలిగించొద్దని డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని గుండ్లసోమారంలో పౌర హక్కులపై శనివారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కుల, మతాలకు అతీతంగా జీవించాలని, అంటరానితనం, కులవివక్ష ఉండవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గణేష్, సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మండల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఐదేళ్ల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం జూలై 4వ తేదీన ముగియనుండగా హాజీపూర్ ఎంపీపీ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ మందపల్లి స్వర్ణలత అధ్యక్షతన చివరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజీపూర్ మండల పరిషత్ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ముందుగా మండల అధికారులు తమ శాఖలకు సంబంధించి తాజా నివేదికలను సభ్యుల ఎదుట చదివి వినిపించారు.

'నిస్వార్థంగా సేవలందించడం గొప్ప వరం'



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న గవర్నర్

జన్నారం: నిస్వార్థంగా సేవలందించే అవకాశం రావడం గొప్పవరమని, అలాంటి నిస్వార్థ సేవ లయన్స్‌క్లబ్ ద్వారా లభిస్తుందని మంచిర్యాల జిల్లా లయన్స్‌క్లబ్ ఉప గవర్నర్ మోర బద్రేశం అన్నారు. నూతన కార్యవర్గాన్ని శనివారం నియమించారు. అధ్యక్షుడిగా కస్తూరి సతీశ్‌కుమార్, కార్యదర్శిగా కొమురవెల్లి సందీప్‌కుమార్, కోశాధికారి కసవతి జగదీశ్, ఉపాధ్యక్షులుగా తోట లచ్చన్న, రమేశ్ రావు, మెంబర్షిప్ డైరెక్టర్ సురేశ్, ఎల్‌సిఐఎఫ్ కోఆర్డినేటర్‌గా రాజశేఖర్, క్లబ్ సర్వీస్ కో ఆర్డినేటర్‌గా మల్యాల బాపు, క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా రాజేందర్ నియామకమయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రీజినల్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి అనుముల రాజన్న, కోశాధికారి జక్కు భూమేశ్, జోనల్ చైర్మన్ అంజుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వంశీకృష్ణకు స్వాగతం



జైపూర్: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా విజయం సాధించి తొలిసారి చెన్నూర్ నియోజకవర్గానికి వచ్చిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. జైపూర్ మండలం ఇందారం వద్ద శనివారం ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇందారం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

రమేశ్ రాథోడ్‌కు నివాళులు



పార్థివదేహం వద్ద దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ ఎంపీగా, ఖానాపూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన రమేశ్ రాథోడ్ శనివారం అనారోగ్యంతో మృతి చెందగా, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, లక్సెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్యలు నివాళులర్పించారు. ఉట్నూర్‌లోని రమేశ్‌రాథోడ్ నివాసంలో పార్థివదేహాన్ని ఉంచగా, నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.